జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

బుధవారం 4 మార్చి 2026 పేజీలు : 14




2 లో..



## మా పంట పొలాలకు దారేది...



## ఘనంగా శ్రీ దేవల్ బాలాజీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

కోదాడ పట్టణ పరిధిలోని మూడో వార్డు తమ్మరబండపాలెం గ్రామంలో శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి 9 గంటలకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం వేద పండితుల నడుమ వైభవంగా నిర్వహించారు.

వార్త 2లో

### దమ్మయాత్ర భిక్షువులచే బుద్ధవనములో

# ప్రత్యేక ప్రార్థనలు

### నాగర్జున కొండను సందర్శించిన బౌద్ధ భిక్షువులు

**నాగార్జునసాగర్ మార్చి 3 ప్రజా జ్యోతి**

దమ్మ పాదయాత్ర బౌద్ధ భిక్షువులు బుద్ధ వనములోని ధ్యాన మందిరంలో ప్రత్యేక ప్రార్ధనలు పూజలు నిర్వహించారు.కర్ణాటక గుల్బర్గా బుద్ధ విహార నుండి ప్రారంభమైన దమ్మయాత్ర బుద్ధవనం చేరుకొనిన దమ్మయాత్ర ముగింపు ఉత్సవాలలో భాగంగా మంగళవారం గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షులు గగన్ మాలిక్ ఆధ్వర్యంలో మహస్తూపంలోని ధ్యాన మందిరంలో థాయిలాండ్ దేశం నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక ...మిగతా 2లో



### ఘనంగా సూర్యాపేట పబ్లిక్ స్కూల్

# వార్షికోత్సవ వేడుకలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 03(ప్రజాజ్యోతి):**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట పబ్లిక్ స్కూల్ 25వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం రాత్రి లక్ష్మీ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా డీఈఓ అశోక్, ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ల నామ అరుణ, బత్తుల ఝాన్సీ రమేష్ హాజరై మాట్లాడారు.విద్యార్థులు ప్రణాళిక బద్దంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం పాఠశాల కరస్పాండెంట్ శేషగాని నరేష్ గౌడ్ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత ఫలితాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు.విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.





2

## ఎడమ కాలువలో పడి ఇద్దరు యువకులు గల్లంతు.

## వార్డుల పరిశుభ్రతకు ప్రాధాన్యత



**రామన్నపేట,మార్చి 3 ప్రజా జ్యోతి**

వార్డుల పరిశుభ్రతే మా ముఖ్య ద్యేయమని రామన్నపేట పట్టణ మూడవ వార్డు మెంబర్ కొమ్ము శేఖర్ నాల్గవ వార్డు సభ్యులు మోటే మహేష్ తెలిపారు. సోమవారం నాడు మూడో వార్డులో నాలుగో వార్డులో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను, కంప చెట్లను జెసిబి సహాయంతో తొలగించి శుభ్రం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ వార్డుని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ చెత్తబుట్టలను ఉపయోగించాలని వీధుల వెంట ఖాళీ స్థలాలలో చెత్త వేయరాదని దానివల్ల పందులు అపరిశుభ్రం చేసి వ్యాధులకు కారణమవుతాయని అన్నారు.

# మా పంట పొలాలకు దారేది...

## దారికి అడ్డంగా మట్టి చెత్తా చెదారం, జమ్మి తమ పొలాల వద్దకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న రైతులు

**నల్గొండ రూరల్ మార్చి 3 (ప్రజా జ్యోతి)**

నల్లగొండ మండలం లోని చందన పల్లి గ్రామంలో గల డీ 39 కాల్వ లో పూడికతీతలో వచ్చిన చెత్తాచెదారాన్ని జమ్మి మట్టిని తీసి కాలువ ఎడమవైపు దారిలో అడ్డంగా పడి వేయడంతో అటువైపు పొలాల కు వెళ్లే రైతులు నానా అవస్థలు పడుతున్నారని ఆ గ్రామ రైతులు బండ చినపిచ్చిరెడ్డి, బండ కరుణాకర్ రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పానగల్లు ఉదయ సముద్రం ప్రాజెక్టులోని డీ 39 కాలువలో ఉడుక తీత పేరుతో రాత్రి సమయంలో కాలువలో ఉన్న చెత్తాచెదారాన్ని కాంట్రాక్టర్ కాలువ ఎడమవైపు తీసివేసి దారికి అడ్డంగా వేయడంతో ఉదయాన్నే రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు వచ్చిన రైతులు వెళ్లలేకపోయారని వారు తెలిపారు. కనీసం కాలి నడకన వెళ్లే విధంగా కూడా ఉండకపోవడంతో రైతులు తమ పొలాల వద్దకు పోలేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ ఎడమ వైపు దారి వెంట దాదాపు 60 ఎకరాల పంట పొలాలు ఉన్నాయని ప్రతిరోజు రైతులు తమ పొలాల వద్దకు వెళ్లేవారని కానీ రాత్రికి రాత్రే కాల్వ పూడిక తీసి రోడ్డుకు అడ్డంగా వేయడంతో పొలాల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో రైతులందరం కలిసి ఈ దారిని మేమే నిర్మించుకున్నామని రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కాలువలో నుంచి తీసిన చెత్తాచెదారాన్ని దారికి అడ్డంగా వేయడం ఏంటని అక్కడ ఉన్న వారినీ అడిగితే వారు





నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ ఆ చెత్తంతా అలాగనే ఉంటుంది ఎండినంక తగల పెట్టుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రైతులు వెల్లడించారు. పది,పదిహేను రోజులలో పంట చేతికొచ్చి మార్కెట్ కు తరలించే సందర్భంలో దారికి అడ్డంగా చెత్త జమ్మి మట్టి ఉండడంతో వరి ధాన్యాన్ని మేము ఏ విధంగా మార్కెట్ కి తీసుకెళ్లాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పొలాల్లోకి వెళ్లే దారికి అడ్డంగా ఉన్న చెత్తాచెదారాన్ని తీయించి తమ పొలాల వద్దకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# ఘనంగా శ్రీ దేవల్ బాలాజీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



**కోదాడ టౌన్, మార్చి 03 (ప్రజా జ్యోతి):**

కోదాడ పట్టణ పరిధిలోని మూడో వార్డు తమ్మరబండపాలెం గ్రామంలో శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి 9 గంటలకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం వేద పండితుల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ముడుంబ వేణుగోపాల చార్యులు అధ్యక్షతన కళ్యాణ మహోత్సవ వేలాది మంది భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు మాట్లాడుతూ సుమారు 600 ఏళ్ల క్రితం స్వయంభువుగా వెలసిన ఈ స్వామివారి విశిష్టత ప్రత్యేకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలు, కళ్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోం దని, ఈ ఏడాది కూడా భక్తుల సమక్షంలో శ్రీవారి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినట్లు వెల్లడించారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారని తెలిపారు. భక్తుల సహకా రంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. స్వామివారిని దర్శించి మొక్కులు పెట్టుకున్న వారికి వరప్రసాదం లభిస్తుందనే విశ్వాసం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎడమ కాలువలో పడి ఇద్దరు యువకులు గల్లంతు.

**హాలియా,మార్చి3(ప్రజా జ్యోతి)**

రంగుల పండుగ హోలీ సందర్భంగా విషాద ఘటన చోటు చేసుకుంది.సాగర్ ఎడమ కాలువలో ఇద్దరు యువకులు గల్లంతయిన సంఘటన హాలియా ప్రాంతంలో మంగళవారం సాయంత్రం జరిగింది.హాలియా పోలీసుల వివరాల ప్రకారం పెద్ద ఊర మండలం శిరసనగండ్ల గ్రామానికి చెందిన కన్నెకుంట్ల బబ్లూ చారి (17) నిడమనూరు మండలం సూరే పల్లి గ్రామానికి చెందిన ఆలేటి కార్తీక్ ( 14) అలాగే శాఖ పురం గ్రామానికి చెందిన పోలేపల్లి నాని తదితరులు హోలీ పండుగ జరుపుకున్న అనంతరం సాగర్ ఎడమ కాలువలోని హాలియా అక్విడెక్ట్ సమీపానికి వెళ్లారు. అక్కడ బిరియాని తిన్న అనంతరం చేతులు కడుక్కునేందుకు కార్తీక్ కాలువలోకి దిగగా కాలు జారి వీటిలో పడిపోయాడు.అతడిని కాపాడేందుకు బబ్లు చారి కాల్వలోకి దిగి రక్షించే ప్రయత్నం చేయగా తాను కూడా నీటిలో మునిగిపోయాడు.ఈ ఘటనతో భయపడిన పోలేపల్లి నాని వెంటనే గల్లంతయిన యువకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు.సమాచారం అందుకున్న హాలియా పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ సాయంత్రం వరకు యువకుల ఆచూకీ లభించలేదు.ఉదయం నుంచి కలిసి తిరిగిన ఇద్దరు స్నేహితులు ఇలా గల్లంతవ్వడంతో కుటుంబ సభ్యులు బంధువులు విషాదంలో మునిగిపోయారు. గల్లంతయిన బబ్లు చారి బైక్ రిపేర్ సెంటర్ లో పనిచేస్తుండగా కార్తీక్ 9వ తరగతి చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు.హాలియా సీఐ సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# దమ్మయాత్ర భిక్షువులచే బుద్ధవనములో ప్రత్యేక ప్రార్థనలు





## నాగర్జున కొండను సందర్శించిన బౌద్ధ భిక్షువులు

(మొదటి పేజీ తరువాయి)

సామాగ్రి తో ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా గౌతమ బుద్ధునికి బుద్ధ జ్యోతులను వెలిగించారు. అనంతరం ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు.ఈ కార్యక్రమం అనంతరం ధమ్మా యాత్రలో పాల్గొన్న థాయిలాండ్, భారతదేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు ఇతర బౌద్ధ మతస్తులు థాయిలాండ్ రాజ కుటుంబంతో కలిసి నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. నాగార్జునకొండ మ్యూజియంలో మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్ బౌద్ధ భిక్షులందరికీ మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధ ధాతువులను వీక్షించే అవకాశాన్ని కల్పించారు.నాగార్జునకొండ మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధ దాతువులను దర్శించి బౌద్ధ భిక్షువులు, బౌద్ధ మతస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వీరు నాగర్జున కొండలోని పునర్నిర్మిత మహాస్థూపాన్ని,సింహాల విహారాన్ని సందర్శించారు.వీరితోపాటు బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర,బుద్ధవనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు,స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ చైర్మన్ దంపతులకు బొడ్రాయి వార్షికోత్సవ ఆహ్వానం





**కోదాడ టౌన్,మార్చి 03 (ప్రజా జ్యోతి):**

కోదాడ పట్టణంలోని నాభి శిల బొడ్రాయి 8వ వార్షికోత్సవ వేడుకలకు హాజరుకావాలని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, వెంకటరత్నం బాబు దంపతులను బొడ్రాయి పునః ప్రతిష్ట కమిటీ సభ్యులు సోమవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈ నెల 10వ తేదీన మంగళవారం నిర్వహించనున్న వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ఆ రోజు తెల్లవారుజామున జరిగే జలాభిషేకం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం పున ప్రతిష్ట కమిటీ అధ్యక్షులు నాగుబండి లక్ష్మయ్య దంపతులను వార్షికోత్సవంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి పున్న ప్రతిష్ట కమిటీ సభ్యులు రైతు కమిటీ ముత్యాలమ్మ కమిటీ సభ్యులు పైడిమర్రి వెంకటనారాయణ, ఆవుల రామారావు, పాశం శ్రీను,కోట వెంకటేశ్వరరావు, పందిరి సత్యనారాయణ, వట్టివేళ్ల రవీందర్ రెడ్డి, వేముల రాముడు, సుంకరి నాగయ్య, పెద్ద కోట వెంకటేశ్వరరావు, పారా వెంకటేశ్వర్లు, శేషు,ప్రసాద్, ధనమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మాదిగ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా చింతా బాబు మాదిగ

**- ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ వెల్లడి**

**కోదాడ టౌన్,మార్చి 03 (ప్రజా జ్యోతి):**

ఎమ్మార్పీఎస్ తెలంగాణ అనుబంధ విభాగమైన మాదిగ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కోదాడ పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు చింతా బాబు మాదిగ నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా మేడి పాపన్న మాట్లాడుతూ గత 32 ఏళ్లుగా ఉద్యమంలో చురుగ్గా పనిచేస్తున్న చింతా బాబు సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఎస్సీల సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందేలా భవిష్యత్తు కార్యచరణను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం చింతాబాబు మాదిగ మాట్లాడుతూ తనకు రాష్ట్ర కార్మిక శాఖ అధ్యక్ష పదవి ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మాదిగ బిడ్డకు అండగా ఉండి న్యాయమైన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.





# పసునూరు లో ప్రమాదకరంగా వ్యవసాయ బావి



**నాంపల్లి,మార్చి,03(ప్రజా జ్యోతి):**

మండలంలోని పసునూరు గ్రామంలో పాత గ్రామపంచాయితీ సమీపంలో పాతబడి ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. పదుల కొద్ది పాములు ఇండ్లలోకి వస్తున్నాయి. ఇండ్లలో చిన్న పిల్లలు ఉన్నారు. ప్రక్కనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ కాలనీలోని ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.చనిపోయిన మూగజీవాలను, చెత్త, చెదరం ఆ బావిలో కొందరు పడవేయడం ద్వారా అవి కుళ్లిపోయి విపరీతమైన దుర్వాసన వస్తుంది. దీంతో ప్రజలకు వాంతులు, విరోచనాలతో రోగాల పారిన పడుతున్నట్లు తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

**టిపిసిసి అధికార ప్రతినిధి అన్నపర్తి జ్ఞాన సుందర్**

**తుంగతుర్తి, మార్చి 3, (ప్రజా జ్యోతి):**



గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని టి పిసిసి అధికార ప్రతినిధి అన్నేపర్తి జ్ఞాన సుందర్ అన్నారు.ఆదివారం హైదరాబాదులో తెలంగాణ ప్రదేశ్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామీణ వైద్యుల పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించి మాట్లాడారు. స్వర్గీయ మాజి ముఖ్య మంత్రి రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం గతంలో జివో నంబర్ 1274 విడుదల చేసి గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇచ్చుటకు నిర్ణయించారని అన్నారు. అంతేకాక 104,108 అంబులెన్సు సిబ్బందికి కూడా ప్రాక్టికల్స్ పూర్తి చేయించారని వారికి కూడా శిక్షణ పూర్తి అయిన అనంతరం పరీక్షలు నిర్వహించి కమ్యూటి పారా మెడికల్ సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణం వల్ల శిక్షణ ఆగిపోయింది అన్నారు. 2014,2019,2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కారం చేస్తామని ఎన్నికల మానిఫెస్టోలో పెట్టినారని అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామీణ వైద్యులు కాంగ్రెస్ పార్టీని బలపరిచారని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామీణ వైద్యలకు పరీక్షలు నిర్వహించి కమ్యూనిటీ పారా మెడికల్ సర్టిఫికెట్స్ ఇప్పింఃచాలని కోరారు.ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుల నుండి సానుకూలంగా స్పందన వచ్చిందని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టితో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం నాయకులుజెరిపోతుల లక్మణ్ గౌడ్, డాంగే,రాజేందర్ తదతరులు పాల్గొన్నారు.

# గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా గ్రీన్ హోలీ వేడుకలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 03(ప్రజాజ్యోతి):**

హోలీ పండుగ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సహజ రంగులతో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రీన్ హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది మాట్లాడుతూ సహజ, ఆర్గానిక్ రంగులతో హోలీ వేడుకలు జరుపుకోవడం ఆరోగ్యానికి, పర్యావరణానికి మంచిదని అన్నారు.హానికరమైనటువంటి రంగులతో హోలీ జరుపుకోవడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలతో పాటు నీరు కలుషితమై పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు.సహజరంగులతో హోలీ వేడుకలను నిర్వహించడం అభినందనీయం అని అన్నారు.సహజ రంగుల యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సభ్యులు హోలీ వేడుకలను ఘనంగా జరిపారు.ఈ వేడుకల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్, గ్రీన్ ట్రస్ట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముప్పారపు నరేందర్, డాక్టర్ తోట కిరణ్, ఉప్పల శ్రవణ్, ముప్పారపు నాగేశ్వరరావు, అడ్వకేట్ శశిధర్, దేవరశెట్టి నాగరాజు, కౌన్సిలర్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్,వందనపు శ్రీదేవి,రాచర్ల కమలాకర్, రాచకొండ శ్రీనివాస్,గ్రీన్ క్లబ్ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాలకి నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### అశ్వరావు పలీ నుండి వచ్చే కాలువల పరిశీలన

### గ్రామాల చెరువులు నిండేలా చర్యలు తీసుకోవాలి

### ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ఆలేరు మార్చి 3 ప్రజాజ్యోతి**

గ్రామీణ ప్రాంతాలకు నీటి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని





షారాజిపేట , గొలనుకొండ ప్రాంతాల్లోని అశ్వరావు పల్లి నుండి వచ్చే కాలువల పరిస్థితిని పరిశీలించి ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు గ్రామాల చెరువులు నిండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రెండు మూడు చోట్ల కాలువలు మరవదులు చేయడం ద్వారా నీటి ప్రవాహం సక్రమంగా జరుగుతుందన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి కాల్వలను పునరుద్ధరించాలన్నారు. ఇలా చేయడంతో రెండు గ్రామాల చెరువులు నిండి రైతులకు సాగునీరు అందుతుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు రైతుల విజ్ఞప్తి మేరకు తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు రైతుల సంక్షేమ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, గ్రామ సర్పంచులు కంతి మధు, ఇందూరి యాదిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు చిలుకు నాగరాజు, భీమ గాని శ్రీనివాస్, నాయకులు బాలరాజు,భీమ గాని హరిబాబు, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి ,మధు , అఖిలు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

# మద్యం తాగి వాహనం నడిపేవారు తస్మాత్ జాగ్రత్త

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒక్కరికి జైలు శిక్ష

### పలువురికి జరిమానా

### కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి



**కోదాడ టౌన్, మార్చి 03 (ప్రజా జ్యోతి):**

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి హెచ్చరిం చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు..ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ ముగ్గురు పట్టుబడినట్లు ఎస్సై అంజిరెడ్డి తెలిపారు. పట్టుబడిన వారిని మంగళవారం కోర్టులో హాజరు పరచగా ఒకరికి ఒక్క రోజు జైలు శిక్ష రూ.2000 జరిమానా, అదేవిధంగా మద్యం సేవించిన మరో ఇద్దరికీ రూ.4000/- జరిమానా విధిస్తూ సెకండ్ క్లాస్ సత్యనారాయణ తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి తెలిపారు....మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మోటకొండూరులో మహిళ బలవన్మరణం

**ఆలేరు మార్చి 3 ప్రజాజ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండరూ మండలంలోని దిలావర్పూర్ గ్రామంలో మంగళవారం మహిళ ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది.ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం, చత్తీస్‌గఢ్‌కు చెందిన దూర్పాటి బాయ్ (38) గత మూడు సంవత్సరాలుగా కుటుంబంతో కలిసి గ్రామంలో కూలీ పనులు చేస్తూ నివసిస్తోంది. గత మూడు రోజులుగా కడుపు, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ మంగళవారం ఇంట్లోనే ఉంటానని చెప్పగా, భర్త మరియు కుమారుడు పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆమె మృతిచెందినట్లు గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం



ఇవ్వగా, ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి అక్క చెమిలీ భాయ్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# నాంపల్లి మండల వ్యాప్తంగా అంబరాన్నంటిన హోలీ సంబరాలు



**నాంపల్లి,మార్చి,03(ప్రజా జ్యోతి)**

:మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు సంప్రదాయ బద్ధంగా అంబరాన్నంటాయి. కులమతాలకు అతీతంగా చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు పెద్ద ఎత్తున విధులలో గుంపులు, గుంపులుగా చేరి ఐక్యత భావం చాటుతూ ఒకరి పై ఒకరు రంగులు చల్లుకుంటూ మండల వ్యాప్తంగా కేరింతలతో సందడి చేశారు. చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ హోలీ పండుగ సంబరాలు చిన్నారులు, యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. మండలమంతా రంగులమయమై హోలీ పండుగ వాతావరణం కోలాహలం నెలకొంది.

# నార్కట్ పల్లి మండలంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

### – పేరుకేమో కిరాణా షాప్, మద్యం అమ్ముతున్న వైనం

### – చోద్యం చూస్తున్న అధికారులు

నార్కట్ పల్లి, మార్చి3( ప్రజా జ్యోతి ): యువత మద్యం మారిన బడి అనారోగ్యం పాలవుతున్న కిరాణం మరియు బెల్టు షాపుల్లో ఉదయం నాలుగు గంటల నుండి రాత్రి 12 గంటల సమయంలో మద్యం బాబులకొండగా మారుతుంది. అయినా ప్రభుత్వ అధికారులు మండల కేంద్రంలోని ఉన్న కిరాణా షాప్ లో గాని, ఏ ఇతర బెల్ట్ షాపుల్లో మద్యం అమ్ముతున్న ఎక్సేంజ్ అధికారులు కానీ, ప్రభుత్వ అధికారులు గానీ, హోలీ పండుగ సందర్భంగా మద్యం మత్తులో ఉన్న యువతను పట్టించుకోవడంలో అధికారులమయ్యారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, కిరాణా షాపుల్లోనూ, బెల్టు షాపులపై ఉన్న మద్యం స్వాధీనం చేసుకొని, యువతను కాపాడుతుందిగా పలువురు కోరుతున్నారు.


# నార్కట్ పల్లి మండలంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

### – పేరుకేమో కిరాణా షాప్, మద్యం అమ్ముతున్న వైనం

### – చోద్యం చూస్తున్న అధికారులు


**నార్కట్ పల్లి, మార్చి3( ప్రజా జ్యోతి ):**

యువత మద్యం మారిన బడి అనారోగ్యం పాలవుతున్న కిరాణం మరియు బెల్టు షాపుల్లో ఉదయం నాలుగు గంటల నుండి రాత్రి 12 గంటల సమయంలో మద్యం బాబులకొండగా మారుతుంది. అయినా ప్రభుత్వ అధికారులు మండల కేంద్రంలోని ఉన్న కిరాణా షాప్ లో గాని, ఏ ఇతర బెల్ట్ షాపుల్లో మద్యం అమ్ముతున్న ఎక్సైజ్ అధికారులు కానీ, ప్రభుత్వ అధికారులు గానీ, హోలీ పండుగ సందర్భంగా మద్యం మత్తులో ఉన్న యువతను పట్టించుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, కిరాణా షాపుల్లోనూ, బెల్టు షాపులపై ఉన్న మద్యం స్వాధీనం చేసుకొని, యువతను కాపాడుతుందిగా పలువురు కోరుతున్నారు.

# మండల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

**ఎన్ వి సుబ్బారావు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**



**పాలకవీడు, మర్చి 3(ప్రజా జ్యోతి ):**

హోలీ పండుగను మండల ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్ వి సుబ్బారావు పిలుపునిచ్చారు. మండల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక (కెమికల్) రంగులు వినియోగించకుండా, పూలు ఔషధ మొక్కలు, ప్రకృతి వనరులతో తయారైన సహజ రంగులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని హోలీ పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధుల ఆరోగ్యన్నీ దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటించాలని హోలీ పండుగను ప్రేమ ఐక్యత సౌభ్రాతృత్వానికి ప్రతిక గా మలుచుకోవాలని అన్నారు.

# గ్రహాణం ఎఫెక్ట్..నిటారుగా నిలబడ్డ రోకలి





**చింతపల్లి మార్చి 03(ప్రజాజ్యోతి)**

గ్రహనం పట్టిన రోజు రోకలి నిటారుగా నిలబటం మీరెప్పుడైన చూశారా? అదేంటని అచ్చర్య పోకండి. రోకలి పట్టుకోకపోయిన నిటారుగా నిలబడింది. ఈ అచ్చర్య సంఘటన చింతపల్లి మండలం తీర్మలాపురం గ్రామంలో చోటుచేసుకుంద.చంద్ర గ్రహణ సమయంలో దేశంలోలోని పలు ప్రాంతాల్లో వింత ఆచారాలు, పోకడలు మూఢనమ్మకాలు చూస్తూంటాము. గ్రహణ సమయంలో గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకుంటారు.అచ్చర్య సంఘటన చింతపల్లి మండలం తీర్మలాపురం గ్రామంలో చోటుచేసుకుంది.ఇక వివరాల్లోకి వెళ్తే తీర్మలాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు కలకొండ రాములమ్మకు ఎనకటి మూఢనమ్మకలపై కొంచం ఎక్కువ శ్రద్ద చూపిస్తుంది.మంగళవారం చంద్ర గ్రహణం పట్టిన విషయం తెలిసిందే. అదే సమయంలో రోకలిబండలో రోకలి ని నిటారుగా నిలబెట్టి అచ్చర్యానికి గురి చేసింది.ఈ వింత సంఘటన చూడటానికి గ్రామస్తులు తరలివచ్చారు.

# పాలకీడు మండల కేంద్రంలో ఘనంగా హోలీ సంబరాలు

**పాలకవీడు, మర్చి 3(ప్రజా జ్యోతి):**



పాలకీడు మండల కేంద్రంలో హోలీ పండుగ పర్వదినం సందడి వాతావరణంలో జరిగింది. ముఖ్యంగా చిన్నారులు రంగురంగుల కలర్లు చల్లి కేరింతలు కొడుతూ హోలీ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కాలనీలు, వీధుల్లో ఉదయం నుంచే పిల్లల అల్లరి సందడి కనిపించింది. ఒకరిపై ఒకరు రంగులు పోసుకుంటూ, నీటి తుపాకులతో ఆడిపాడుతూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో సురక్షితంగా వేడుకలు నిర్వహించారు. ఎటువంటి అపశృతి లేకుండా హోలీ పండుగను చిన్నారులు సంతోషంగా జరుపుకోవడం విశేషం. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ,భారతీయ సంస్కృతిలో పండుగలు కేవలం సంబరాలకు మాత్రమే పరిమితం కావు. అవి మన ఆత్మను, ఆచారాలను, ఆలోచనలను తీర్చిదిద్దే ఆధ్యాత్మిక పాఠాలుగా నిలుస్తాయి,హోలీ అంటే రంగులు. కానీ ఆ రంగుల వెనుక ప్రకృతి సోయగం దాగి ఉంది. పసుపు పూలు, గులాబీలు, చెర్రీ పుష్పాలు, నీలి ఆకాశం ప్రకృతి ఇచ్చిన ఈ వర్ణాలను మనం పరస్పరం పంచుకోవడం అంటే ప్రకృతితో మన అనుబంధాన్ని పునరుద్ధాటించడం. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ సహజ వనరులతో తయారైన రంగులనే వినియోగించడం పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్య రక్షణకు దోహదం చేస్తోంది,హోలీకి కులం, మతం, ప్రాంతం అనే భేదాలు లేవు. ఉత్తర భారతదేశంలో ఘనంగా జరుపుకునే ఈ పండుగ ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించింది. ఇది వైవిధ్యంలోని ఏకత్వాన్ని ప్రతిబింబించే పండుగగా నిలుస్తోంది. నేటి కాలంలో సామాజిక మాధ్యమాల కారణంగా విభేదాలు పెరుగుతున్న సందర్భంలో, హోలీ మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతుంది- రంగులు కలిసినప్పుడే అందం పెరుగుతుంది; మనుషులు కలిసినప్పుడే దేశం బలపడుతుంది,భారతదేశం వైవిధ్యానికి ప్రతీక. భాషలు, సంప్రదాయాలు, వేషాలు భిన్నమైనా మనం ఒకటే అన్న భావనను బలపరిచే పండుగ హోలీ. ఇది కేవలం రంగుల సంబరం కాదు-భక్తి, భ్రాతృత్వం, భవిష్యత్తుపై ఆశ అనే మూడు విలువల సమ్మేళనం,ఈ హోలీ మనకు కేవలం ఆనందాన్నే కాదు, ఆలోచననూ అందించాలి. చెడును దహనం చేసి మంచిని ఆహ్వానిద్దాం. సహజ రంగులతో ప్రకృతిని కాపాడుదాం. విభేదాలను మరిచి హృదయాలను కలుపుదాం. ఎందుకంటే హోలీ అంటే కేవలం రంగుల ఆట కాదు.. మనసుల కలయిక. హోలీ అంటే సంబరం మాత్రమే కాదు-సంస్కృతి సజీవత. రంగుల పండుగ మన దేశానికి రంగుల భవిష్యత్తును అందించాలన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ లక్ష్మి సత్యం వార్డు మెంబెర్లు జానీ, వెంకటయ్య, శ్రీను యూత్ సభ్యులు, నాగరాజు, సురేష్, నవీన్, చంటి హనుమంత్, రాములు మహేందర్, వెంకన్న, అన్వేష్,సతీష్, ఉత్తమ్, తదితరులు పాలుగోన్నారు.

# విద్యా కమిషన్ నివేదిక తప్పుల తడక

## సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు ధ్వజం

**పాలకవీడు, మర్చి 3(ప్రజా జ్యోతి ):**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన విద్యా కమిషన్ నివేదిక తప్పుల తడక గా ఉన్నదని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనంజయ నాయుడు ధ్వజమెత్తారు. మంగళవారం నాడు ఆయన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలో మండల సిపిఐ కార్యదర్శి ముళ్ళ జానయ్య,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, జిల్లా కమిటీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ..... బడుగు బలహీన వర్గాల పిల్లలను విద్యకు దూరం చేయటంలో భాగంగానే ఇలాంటి సిఫారసులు చేసిందని, కార్పొరేట్ కళాశాలకు కొమ్ము కాసే ప్రయత్నంలో భాగంగా విద్యా కమిషన్ ప్రవేశ పరీక్షను రద్దుచేసి, ఇంటర్లో విద్యార్థి సాధించిన మార్కుల ఆధారంగా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కల్పించాలని కోరిందని అలాగే ఫీజు రియంబర్స్మెంట్ రద్దు చేయాలని సూచించడం కూడా సరైనది కాదని, ఈ పథకం ఉండడం వల్లనే గ్రామీణ మండల నియోజకవర్గస్థాయిలో నివాసం ఉంటున్న విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించగలుగుతున్నారని, ఉపాధ్యాయుల కు చెల్లిస్తున్న జీతాలు చాలా అధికంగా ఉన్నాయని కొత్తగా చేపట్టే నియామకాలు ఎంపిక అయ్యే వారిని తక్కువ జీతంతో కాంట్రాక్టు పద్ధతిన నియమించాలన్న సిఫార్సులను అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి,ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండించాలని ఆయన కోరారు. ప్రీ- ప్రైమరీ విద్యను పాఠశాలలకు తరలిస్తే రాష్ట్రాల్లోని 35 వేల అంగన్వాడి కేంద్రాల పరిస్థితి ఏమిటని,వాటిని మూసివేస్తారా అని ఇది కేవలం ప్రభుత్వ ఖర్చు తగ్గించేందుకు చేస్తున్న కుట్ర అని దీనివల్ల అంగన్వాడి వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతుందని విద్యావేత్త అయిన ఆకునూరి మురళి ఇలాంటి సిఫార్సులు చేయడం వెనక ఎవరున్నారు అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ నివేదికను పెండింగ్ లో ఉంచాలని అన్ని విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, అన్నియూనియన్లతో సంప్రదింపులు జరిపి వారి సూచనల మేరకు నివేదికను రూపొందించాలని ఆయన కోరారు.



# కులమతాలకు, మతసామరస్యానికి ప్రతీక హోలీ

## కౌన్సిలర్ ఉమా ఆంజన్ గౌడ్

**కోదాడ టౌన్,మార్చి 03 (ప్రజా జ్యోతి):**

కోదాడహోలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీతమైనది అని అర్థం కుల,మతాలకు అతీతంగా చిన్నా,పెద్ద,ఆడ,మగ తేడా లేకుండా ప్రతి ఒక్కరూ జరుపుకునే పండుగ హోలీ పండుగ అని 30 వ వార్డు కౌన్సిలర్ కారింగుల ఉమా అంజన్ గౌడ్ అన్నారు. మంగళవారం రాజీవ్ నగర్ వీధిలో ఘనంగా హోలీ సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కారింగుల ఉమా అంజన్ గౌడ్







మాట్లాడుతూ దీపావళి తర్వాత దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగల్లో ఇదీ ఒకటి హోలీ పండుగని చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ రంగులు చల్లుకుంటారని అన్నారు.హోలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ సంతోషాలతో పాటు ఆనందాలు వెల్లివిరియాలని కోరారు.ఈ పండుగను ప్రజలు పువ్వులతో,రంగులతో ఈ ఉత్సవాన్ని జరుపుకుంటారు.ఇలా రంగులు,పూలు చల్లుకోవడం ద్వారా ప్రేమ,సౌభాగ్యాలు వెల్లివిరిస్తాయని నమ్ముతారని అన్నారు.హోలీ పండుగ సహజమైన రంగులతో జరుపుకోవాలని అన్నారు.హోలీ అనంతరం స్నానాలకు బావుల వద్దకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకొని సురక్షితమైన ప్రాంతాలలోని స్నానాలు ఆచరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ తెరిసా యూత్ అధ్యక్షులు కొలిపాక రాజేష్, చలిగంటి ఉపేందర్, మిరియాల సైదులు, ఎర్రంశెట్టి రవీందర్, గోపి, కార్తీక్, సత్తార్, శ్రీకాంత్, మనోజ్, మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ పండుగ సంబరాలు



**హాలియా,మార్చి3(ప్రజా జ్యోతి)**

హోలీ పండుగ సందర్భంగా మంగళవారం హాలియా పట్టణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యువత ప్రధాన రహదారులపై చేరుకొని రంగురంగులతో హోలీ సంబరాలు చేసుకున్నారు.ఈ వేడుకల్లో హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి పారిశుద్ధ కార్మికులతో కలిసి హోలీ సంబరాలు నిర్వహించారు. ఆయనతోపాటు హాలియా సిఐ సతీష్ రెడ్డి,ఎస్సై సాయి ప్రశాంత్, మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి,మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్,కౌన్సిలర్ లు నకిరేకంటి అన్నపూర్ణ సైదులు,చేరుపల్లి ముత్యాలు,కరుణ సాగర్,పాంపాటి శ్రీనివాస్ పలువురు ఉపాధ్యాయులు హోలీ సంబరాలు చేపట్టారు.

# యువత మారాలి... జీవితం మార్చుకోవాలి

**భూదాన్ పోచంపల్లి, మార్చి 03 (ప్రజాజ్యోతి)**

నేటి సమాజంలో ప్రతి ఊరు, ప్రతి పట్టణం ఒకే దృశ్యాన్ని చూపిస్తోంది. యువత జీవితం చిన్న చిన్న సరదాలకు పరిమితం అయ్యింది. చదువులు, పని, లక్ష్యాలు అన్నీ పక్కన పెట్టి, తాత్కాలిక ఆనందాల్లో మునిగి గడుపుతున్నారు. యుక్త వయసులో చేయాల్సిన కృషిని వదిలేసి, "ఎవరో నా కోసం ఉంటారు" అనుకునే భ్రమలో, ఫోన్ల బానిసలు అయిపోతూ, చెడు అలవాట్లలో మునిగి, తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నారు. సమాజానికి ఉపయోగపడే పనిలో పాల్గొనకపోవడం, సమయాన్ని వృథా చేయడం... ఇవన్నీ యువతను, సమాజాన్ని ఆగిపెట్టే ప్రధాన కారణాలు. కానీ మార్పు సాధ్యమే. యువత క్రమశిక్షణ, లక్ష్యపరమైన శ్రద్ధతో ముందుకు రాగలగాలి. చదువులో ప్రతిభ చూపడం, ఉద్యోగంలో శ్రద్ధ



చూపడం, సామాజిక సేవలో పాల్గొనడం -- ఇవన్నీ సమాజానికి కొత్త జీవాన్ని ఇస్తాయి. చిన్న సరదాలకంటే, పెద్ద లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించే యువతే భవిష్యత్తును నిర్మిస్తుంది. యువత మారితే సమాజం మారుతుంది. సమాజం మారితే దేశం ఎదుగుతుంది. చెడు అలవాట్లకు దూరంగా, శ్రద్ధతో, పట్టుదలతో ముందుకు సాగితే, సమాజం ఆత్మవిశ్వాసంతో, సకల అభివృద్ధితో పటిష్టంగా నిలుస్తుంది. అందుకే... యువత మారాలి. జీవితం మార్చుకోవాలి.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ

**తుంగతుర్తి, మార్చి 3, (ప్రజా జ్యోతి):**

హిందూ ముస్లిం ఐక్యతకు ప్రత్యేక గా రంజాన్ పండుగ నిలుస్తుందని అన్నారం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఆదివారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో తన స్వగృహంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసి మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు దాతృత్వానికి నిదర్శనం అన్నారు.ఈ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని కోరారు.సర్వ మతాల సారం ఒక్కటేనని ఉపవాస దీక్షలు, ఆరాధన, ప్రార్థనలు, మనుషుల్లో మానవత్వం, ప్రేమ, సోదర భావం, వంటి సద్గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోరారు.గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దొంగరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సరిత, మాజీ సర్పంచ్ చిత్తలూరి సోమశేఖర్, సీనియర్ నాయకులు తన్నీరు యాదగిరి ముస్లిం సోదరులు హఫీజ్, ఇలియాజ్, మహమ్మద్ సిద్దిక్, అహ్మద్ హుస్సేన్, షేక్ లతీఫ్, బింగి వెంకటేశ్వర్లు, ప్రవీణ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# పార్టీకి సంబంధం లేకుండా గ్రామ శాఖ ఎన్నిక.....

## నమిల కాంగ్రెస్ కమిటీ చెల్లదన్న మహేందర్ గౌడ్...

**రాజాపేట, మార్చి 3 (ప్రజా జ్యోతి )**

రాజాపేట మండలం కాంగ్రెస్ పార్టీ నమిల గ్రామ శాఖ కమిటీ చెల్లదని రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల



మహేందర్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు లకు ఎలాంటి సమాచారం, సంబంధం లేకుండా 2వ, తేదీన వేసిన నమిల కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీ నిబంధనలకు విరుద్ధమన్నారు. అట్టి కమిటీ గుర్తించబమని పాత కమిటీ కొనసాగుతుందని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాల మేరకు కమిటీలు వేయబడతాయని మండలంలోని అన్ని గ్రామ శాఖలు ఈ విషయాన్ని గమనించాలని మహేందర్ గౌడ్ సూచించారు.

# జన్మదినం సందర్భంగా ఆలయాలను దర్శించుకున్న ఉప్పల మనీష్.....



**రాజాపేట, మార్చి 3 (ప్రజా జ్యోతి )**

రాజాపేటకు చెందిన ఉప్పల మనీష్ తన జన్మదిన వేడుకలను సోమవారం స్వగ్రామమైన రాజాపేట లోనే జరుపుకున్నారు. హైదరాబాదులోని ఇబ్రహీంపట్నంలోని సివిఆర్ కాలేజీలో బిటెక్ చదువుతున్న మనీష్ పుట్టినరోజు పూర్తిగా ఆలయాల దర్శన కోసం కేటాయించారు. ఉదయాన్నే తలంటు స్నానం చేసి సాంప్రదాయ దుస్తులతో రాజాపేట లోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో సకల దేవతలను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ గోత్రనామార్చనలు చేసి మనీష్ ను ప్రత్యేకంగా ఆశీర్వదించారు. శ్రీ స్వామి వారి విశేష శాలువాతో సత్కరించారు. అనంతరం తల్లిదండ్రులు స్వప్న రమేష్ లతో కలిసి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని, స్వర్ణగిరి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జన్మదినం సందర్భంగా ఆలయంలో గోత్రనామార్చన జరిగింది. అర్చకులు ప్రత్యేకంగా ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తన తాత ఉప్పల పెద్ద పోచయ్య తండ్రి ఉప్పల రమేష్ ఆధ్యాత్మిక వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని జన్మదినం రోజు పూర్తిగా ఆలయాల దర్శనాలలో నిమగ్నమై పెద్దల ఆశీర్వాదం పొందారు. ప్రస్తుత పరిస్థితులలో బర్తడే వేడుకలను పాశ్చాత్య పోకడలతో నిర్వహించుకుంటుండగా అందుకు భిన్నంగా సాంప్రదాయంగా ఉప్పల మనీష్ పుట్టినరోజు వేడుకలను చేసుకోవడం తో పలువురి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా ద్వారా అనేకమంది స్నేహితులు పెద్దలు ఉద్యోగులు ఉపాధ్యాయులు వర్తక వ్యాపారస్తులు బంధువుల, కులస్తుల శుభాకాంక్షలు అందుకని ఆశీర్వాదం పొందారు. కేక్ కట్ చేయడం దావత్ చేసుకోవడం లాంటి కార్యక్రమాలకు ఆయన స్వస్తి పలికి వికలాంగుల పిల్లలకు స్వీట్లు అందజేశారు.

# రాజపేటలో ఘనంగా హోలీ వేడుకలు.....

**కులమత, వయో బేధాలు లేకుండా సంబరాలు....**

రాజాపేట, మార్చి 3 (ప్రజా జ్యోతి ) హోలీ పండుగ వేడుకలు రాజాపేట మండలంలో ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాలలో సంబరాలు జరుపుకున్నారు. రాజపేట మండల కేంద్రంలో సర్పంచి కోయ మధు ఆధ్వర్యంలో హోలీ సంబరాలు సంతోషంగా జరుపుకున్నారు. వయోభేదం లేకుండా చిన్నపిల్లలు, పెద్దలు యువకులు అన్ని కులాలకు చెందినవారు మతాలకు చెందినవారు ఉద్యోగులు వర్తకులు వ్యాపారస్తులు రాజకీయ నాయకులు అన్ని పార్టీల వారు జర్నలిస్టులు పోలీసులు ప్రతి ఒక్కరూ హోలి వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పారు. ఎస్సై లింగారెడ్డి, ఎస్సై మైసయ్య ఇతర పోలీసు బృందానికి రంగులు తల్లి హోలీ శుభాకాంక్షలు చెప్పారు. అంతేకాకుండా పోలీసులు అందరూ హోలీ సంబరాలు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ప్రజలతో మమేకమై రంగులు చల్లారు. డప్పు వాద్యాలతో నృత్యాలు చేస్తూ బాణాసంచా కాల్చారు. గ్రామంలో ప్రధాన వీధులలో ఊరేగింపుగా వెళుతూ హోలీ శుభాకాంక్షలు చెప్పారు. జాతిపిత మహాత్మా గాంధీ కూడలి వద్ద ప్రత్యేక నృత్యాలు చేశారు.



# వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ

**రైతులను బెంబేలెత్తిస్తున్న మోటార్ల దొంగలు**

**దాదాపు 20 మోటార్ల వైర్లను**

**కత్తిరించిన దుండగులు**

**మోటార్లకు వైర్లు లేక లబోదిబోమన్న రైతులు**

**సుభాష్ నగర్ లో ఇది నాల్గోసారి చోరీ**

**పోలీసుల వైఫల్యమే కారణమా**



**గరిడేపల్లి,మార్చి 03(ప్రజా జ్యోతి) :**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని అబ్బిరెడ్డి గూడెం గ్రామ పంచాయతీ పరిధి సుభాష్ నగర్ లో 20 వ్యవసాయ మోటార్ల వద్ద కేబుల్ వైర్లను పలువురు దొంగలు కత్తిరించుకుపోయారు.మంగళవారం ఉదయం పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు ఈ విషయాన్ని గమనించారు.సబ్ మెర్సి బుల్ మోటారు నుంచి మెయిన్ బోర్డు వరకు ఉండే కేబుల్ వైర్లు కట్చేసి ఉండటాన్ని గమనించి స్థానిక రైతులు ఆందోళన చెందారు.మొత్తం 20 మోటార్ల వరకు లెక్క తేలాయని బాధిత రైతులు గాదె మల్లారెడ్డి,జానపాటి శంకర్, నంద్యాల రాము,కుసుమ సైదిరెడ్డి, కాంతారెడ్డి తదితరులు చెప్పారు.ఒక్కో మోటారు వద్ద 40 మీటర్ల కేబుల్ వైరు కట్ చేశారని,మీటరు కేబుల్ వైరు రూ.150 చొప్పున ఉందని,ఈ లెక్కన 20 మోటార్ల వద్ద సుమారు రూ.1లక్ష కేబుల్ వైర్లు కత్తిరించేశారని సదరు రైతులు చెప్పారు.గతంలో మూడుసార్లు కేబుల్ వైర్లు కట్ చేశారని,ఇది నాల్గోసారి అని పేర్కొన్నారు.మూడుసార్లు ఇలాంటి సంఘటనలు జరగగా ఒకసారి పోలీసులకు ఫిర్యాదు చేశామని,ఒక్క దొంగని కూడా పట్టుకోలేదని,ఇకపై పోలీసులకు ఫిర్యాదు చేయదలచుకో లేదన్నారు.కరకట్టపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లయితే దొంగలు దొరుకుతారని,ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.పంటలకు నీరు పెట్టాలంటే మళ్లీ ప్రతి మోటారుకు రూ.3,600 ఖర్చుచేసి కేబుల్ వైరు కొనాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇకనైనా పోలీసులు రాత్రి సమయాలో గట్టి నిఘా పెట్టి దొంగలను పట్టుకుని కేబుల్ వైర్ల చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

**సాహితి హైస్కూల్ లో ఘనంగా ఫేర్వెల్ సెలబ్రేషన్స్**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 03(ప్రజాజ్యోతి):విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా కేంద్రంలోని సాహితి హైస్కూల్ కరస్పాండెంట్ తీగల ఉపేందర్ రావు అన్నారు.సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్ సమీపంలో గల సాహితీ హైస్కూల్ లో పదవ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా క్రమశిక్షణకు మారుపేరుగా సాహితీ స్కూల్ నిలుస్తూ ఎంతో మంది విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించామని తెలిపారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమయాన్ని వృధా చేయకుండా కష్టపడితే ఏదైనా రంగంలో విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ సంబరాలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 03(ప్రజాజ్యోతి)**




:ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు 18 వ వార్డు కౌన్సిలర్, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో మహావీర్ ఫుడ్ కోర్టు వద్ద హోలీ సంబరాలను మిత్రులతో కలిసి మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులాలకు మతాలకతీతంగా నిర్వహించుకునే పండుగ హోలీ అని అన్నారు.హానికర రసాయనాలతో కూడిన కృత్రిమ రంగులు ఉపయోగించకుండా ప్రతి ఒక్కరూ సహజమైన రంగులతో నిర్వహించుకోవడం ద్వారా ఆరోగ్యం తో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, న్యాయవాదులు, మిత్రులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.